సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం । 11 । ఆగస్టు । 2024



తప్పనున్న మూసీ కష్టాలు

బీబీనగర్–పోచంపల్లి మార్గంలో రుద్రవెల్లి – జూలూరు మధ్య మూసీపై హైలెవల్ బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయి. - 9లో



హర్‌ఘర్ తిరంగా యాత్ర

బీజేపీ నాయకులు శనివారం చౌటుప్పల్, నారాయణపురంలో హర్‌ఘర్ తిరంగా యాత్ర నిర్వహించి మాట్లాడారు. - 9లో



ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ..

మోత్కూరులో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. - 9లో

చూసొద్దాం.. అందాల సాగర్

సండే స్పెషల్



ప్రపంచ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్. ఇక్కడి బుద్ధవనం, పచ్చని అటవీ ప్రాంతం, ఎత్తిపోతల జలపాతం, స్పిల్‌వే మీదుగా కృష్ణమ్మ ఉరకలు, అనుపు, లాహిరి లాహిరి లాహిరిలో అనేలా లాంచీ ప్రయాణం, నాగార్జునకొండ ఇలా.. సాగర్‌లో ప్రతి ప్రాంతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

ప్రత్యేక కథనం 8లో



నిండు సాగరం

సాగర్ జలాశయం వద్ద శనివారం ఇన్‌ఫ్లో 3,36,708 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 3,41,785 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రస్తుత నీటిమట్టం 588 అడుగులు (306.1010 టీఎంసీలు)గా ఉంది. జలాశయం నిండుకుండను తలపిస్తోంది.

న్యూస్‌రీల్

జిల్లా ఆస్పత్రిలో టోల్‌ఫ్రీ నంబర్

భువనగిరి : సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో టోల్‌ఫ్రీ నంబర్ 82478 16525 ఏర్పాటు చేసింది. ఈ నంబర్ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మనోహర్ తెలిపారు. సెలవు దినాలు మినహా మిగతా అన్ని రోజుల్లో పని చేస్తుందన్నారు. వ్యాధుల తీవ్రత అధికంగా ఉంటే టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందజేయాలని పేర్కొన్నారు.

కల్లుగీత వృత్తిదారులకు శిక్షణ ఇవ్వాలి

భువనగిరిటౌన్ : కల్లుగీత వృత్తిదారులకు వృత్తినైపుణ్య శిక్షణ ఇవ్వాలని, తాటి చెట్లు ఎక్కేందుకు ఆధునిక యంత్రాలను అందుబాటులోకి తీసుకోరావాలని అఖిలభారత గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం భువనగిరిలో జరిగిన గీత పనివారల సంఘం జిల్లా సమితి సభ్యులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రాచీనకాలం నుంచి గీత వృత్తి ప్రసిద్ధి చెందినదని, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం దున్నేవానికి భూమి, గీసే వారికి చెట్టు నినాదం ఇచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో గీత పనివారల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ బొమ్మగాని నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేష్ పాల్గొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు



స్వామి, అమ్మవారికి తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు విశేషంగా చేపట్టారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు స్వయంభూలకు ప్రభాత సేవ చేపట్టి నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపం, ముఖమండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడవీధిలో ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం, నిత్యకల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

సూర్యాపేట టౌన్: ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేసి ఎస్‌జీటీలకు న్యాయం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన పదోన్నతులు, బదిలీ ప్రక్రియ ఉపాధ్యాయులను సంతోషపరిచిందని, అయితే ఎస్‌జీటీ ఉపాధ్యాయులు మాత్రం తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు వారికి కూడా ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేసి ఉమ్మడి ప్రాతిపదికన బీఈడీ వారికి కూడా పదోన్నతి అవకాశం కల్పించాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ విధుల నుంచి రిలీవ్ చేయాలని, బదిలీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 317 జీఓ బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, పెండింగ్ డీఏలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగయ్య, ప్రధాన కార్యదర్శి బీవీ.రావు, ప్రతినిధులు ఎం.దశరథ రామారావు, పి.వెంకటేశ్వర్లు, యోగానంద్, సీహెచ్.కవిత, సీహెచ్.వెంకటేశ్వర్లు, ఆనంద్‌భాస్కర్, రమణ, వేణు, ప్రభాకర్ పాల్గొన్నారు.

7 కొత్త పంచాయతీలు

అన్నీ ఆలేరు నియోజకవర్గంలోనే..

- ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదముద్ర
- 15 రోజుల్లో ప్రక్రియ పూర్తి
- 428కి పెరగనున్న గ్రామ పంచాయతీలు

సాక్షి, యాదాద్రి : జిల్లాలో కొత్తగా ఏడు గ్రామ పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ పరిధి కిలో మీటరు వరకు విస్తరించి ఉంటే, సదరు పంచాయతీలోని 500 జనాభాకు పైబడి ఉన్న విలీన గ్రామాలను విభజించి పంచాయతీలుగా ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా పంచాయతీ అధికారులు గత సంవత్సరమే ప్రతిపాదనలు పంపగా.. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తూ రెండు రోజుల క్రితం గెజిట్ విడుదల చేసింది. జిల్లాలో ప్రస్తుతం 421 గ్రామ పంచాయతీలు ఉండగా.. కొత్త వాటితో కలిపి 428కి చేరనున్నాయి. ఎలాంటి అవాంతరాలు లేకపోతే 15 రోజుల్లో కొత్త పంచాయతీలు సాకారం అయ్యే అవకాశం ఉంది.

నూతనంగా ఏర్పాటు కానున్న పంచాయతీలు ఇవీ..

జిల్లాలో కొత్తగా ఏర్పాటు కానున్న పంచాయతీలు అన్నీ ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని సాయిగూడెం, ఆలేరు మండలం కొలనుపాక నుంచి భైరాంనగర్, తుర్కపల్లి మండలం వేల్పుపల్లి నుంచి గూజవాణికుంటతండా, గంధమల్ల నుంచి ఇందిరానగర్, మోటకొండూరు మండలం మాటూరు నుంచి పెద్దబావి, అమ్మనబోలు నుంచి అబిద్‌నగర్, బొమ్మలరామారం మండలం యావాపూర్‌తండా నుంచి కాజీపేటను కొత్త పంచాయతీలుగా అధికారులు ప్రతిపాదించి పంపగా ప్రభుత్వం ఆమోదం తెలిపింది.



మోటకొండూరు మండలం మాటూరు నుంచి పంచాయతీగా ప్రతిపాదించిన పెద్దబావి గ్రామం



సాయిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం కోసం గుర్తించిన భవనం

నూతన పంచాయతీల్లో జనాభా ఇలా..

గ్రామం	ఎస్సీ	ఎస్టీ	ఇతరులు	మొత్తం
భైరాంనగర్	0	8	797	805
ఖాజీపేట	77	11	307	395
అబిద్‌నగర్	5	0	409	414
పెద్దబావి	0	0	420	420
గుర్జవానికుంట తండా	0	324	0	324
ఇందిరానగర్	3	0	634	634
సాయిగూడెం	354	0	623	977

పాత పంచాయతీలతో పాటు ఎన్నికలు

నూతనంగా ఏర్పాటుకానున్న పంచాయతీలకు పాత పంచాయతీలతో పాటు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుత గ్రామ పంచాయతీల నుంచి నూతన పంచాయతీలను విభజించాలని ప్రభుత్వం రెండు రోజుల క్రితం జీఓ జారీ చేసింది. జనాభా ప్రాతిపదికన ఆస్తుల పంపకం, రికార్డులు విభజన చేయనున్నారు. అలాగే నూతనంగా ఆవిర్భవించనున్న పంచాయతీల్లో ప్రభుత్వ భవనాలను గుర్తించి వాటిలో పాలనకు అనువుగా ఉన్న వాటిని ఎంపిక చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. నూతన పంచాయతీలు 6 నుంచి 8 వార్డులతో ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

సంతోషంగా ఉంది



మాటూరు మధిర గ్రామాలైన పెద్దబావి, చాకంపల్లిని కలుపుతూ నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు కానుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంతోషంగా ఉంది. ఈ రెండు గ్రామాల ప్రజలు ప్రస్తుతం ప్రతి పనికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మాటూరుకు వెళ్లాల్సి ఉండేది. నూతన పంచాయతీ ఏర్పాటుతో సమస్య తీరనుంది. రెండు గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.

–వాకిటి జగదీశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్, మాటూరు

ఇన్నాళ్లు ఊరు అభివృద్ధి చెందలేదు



ఆలేరు గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు దాని పరిధిలో ఉన్న సాయిగూడెం ఒకే వార్డు కింద ఉండేది. ఆలేరు మున్సిపాలిటీగా ఏర్పడిన తరువాత రెండు వార్డులుగా విభజించారు, జనాభా ప్రాతిపదికన నిధులు వస్తలేవు.ఇంతకాలం అభివృద్ధి పరంగా వెనుకబడ్డాం. సాయిగూడెంను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేస్తుండడంతో ఆనందంగా ఉంది.

–భైరి నర్సయ్య, మాజీ వార్డు సభ్యుడు, సాయిగూడెం, ఆలేరు

కల సాకారమవుతోంది



ఖాజీపేట ప్రత్యేక పంచాయతీ కావాలని గ్రామస్తులం ఎంతోకాలంగా కోరుకుంటున్నాం. మొదట్లో బొమ్మలరామారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేవాళ్లం. ఆ తరువాత యావాపూర్‌తండా పంచాయతీలో చేర్చారు. మా గ్రామం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్నా అభివృద్ధికి నోచుకోవడంలేదు. ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుతో అభివృద్ధి చెందుతుంది.

–కొడిమాల శ్యాంసుందర్‌రెడ్డి, ఖాజీపేట, బొమ్మలరామారం

భూ తగాదాలు.. సివిల్ పంచాయితీలు!

- పలువురు ఎస్‌ఐలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు
- వరుసగా బదిలీలు
- బదిలీలపై నిషేధం ఉన్నప్పటికీ ఇద్దరికి స్థానచలనం



సాక్షి,యాదాద్రి : జిల్లా పరిధిలో వరుసగా ఎస్‌ఐల బదిలీలు జరుగుతుండడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా అన్ని స్థాయిల్లో పలువురు పోలీసు అధికారులకు స్థానచలనం కలిగింది. ప్రస్తుతం బదిలీలపై నిషేధం ఉన్నప్పటికీ ఆలేరు, బొమ్మలరామారం ఎస్‌ఐలు వెంకటశ్రీను, రాఘవేందర్‌గౌడ్‌ను బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలేరుకు యాదగిరిగుట్ట ఎస్‌ఐ అనిల్‌ను, బొమ్మలరామారం పీఎస్‌కు భువనగిరి పట్టణ ఎస్‌ఐ లక్ష్మీనారాయణను ఇన్‌చార్జ్ లుగా నియమించారు.

కారణాలివేనా?

ఎస్‌ఐల బదిలీల వెనుక అనేక కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. భూ తగాదాలు, సివిల్ పంచాయితీల్లో జోక్యం తలదూరుస్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బొమ్మలరామారం మండలంలో ఓ భూ వివాదంలో ఎస్‌ఐ జోక్యం చేసుకోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో అధికార పార్టీ పెద్దలు కూడా సదరు ఎస్‌ఐ తీరుపై గుర్రుగా ఉన్నారని, అది కూడా ఎస్‌ఐ బదిలీకి కారణమని తెలుస్తోంది.

అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్, బాలరాజు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

భువనగిరిటౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ యూసుఫ్, ఎస్. బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భువనగిరి బైపాస్‌లోని వివేరా హోటల్‌లో జరిగిన ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలు పని చేస్తున్నారని పేర్కొన్నారు. కనీస వేతనాలు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా ఆ ప్రస్తావనే తేవడం లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపి కార్మికుల పక్షాన ఆలోచించాలని కోరారు. కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. గోరేటి రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి చెక్క వెంకటేష్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి ఏశాల అశోక్, వెంకటేశ్, నర్సింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి పోచంపల్లిలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

చిలుకూరు: తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్, తెలంగాణ ఒలింపిక్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ నెల 30, 31న, సెప్టెంబర్ 1వ తేదీన యాద్రాది భువనగిరి జిల్లా భూదానపోచంపల్లిలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు యడవెల్లి పుల్లారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు గుర్తింపు కార్డులతో కేటగిరీల వారీగా పేర్లు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. ముందుగా పేర్లు నమోదు చేయించుకున్నవారు మాత్రమే పోటీలకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 70133 01553, 99661 48808ను సంప్రదించాలని కోరారు.

నేటినుంచి విష్ణు పుష్కరిణిలో 'స్నాన సంకల్పం'

- పూజలు చేసి ప్రారంభించనున్న యాదాద్రి ఈఓ భాస్కర్‌రావు



విష్ణు పుష్కరిణి వద్ద భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండపై ఉన్న విష్ణు పుష్కరిణిలో ఆదివారం నుంచి స్నాన సంకల్ప పూజలు అందుబాటులోకి తీసుకురానున్నారు. పదేళ్ల క్రితం విష్ణు పుష్కరిణిలోనే భక్తులు స్నాన సంకల్ప పూజలు నిర్వహించేవారు. కానీ, ప్రధానాలయ పునఃనిర్మాణం తరువాత అనుమతించడం లేదు. కొండ కింద ఏర్పాటు చేసిన లక్ష్మీపుష్కరిణిలో భక్తులు స్నానమాచరిస్తున్నారు. అయితే, భక్తుల కోరిక మేరకు విష్ణు పుష్కరిణిలో పుణ్యస్నానాలకు అవకాశం ఇవ్వాలని ఆలయ కమిటీ ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విష్ణు పుష్కరిణిలో స్నానమాచరించిన భక్తులు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా సమీపంలోనే ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేస్తున్నారు. స్నాన సంకల్ప పూజలను దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు ఆదివారం ప్రారంభించనున్నారు.

పోరాటాలతోనే హక్కుల పరిరక్షణ

- ఆర్‌టీఐ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్



ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఆవాజ్ కమిటీ ప్రతినిధులు

భువనగిరిటౌన్ : రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కల్పించేందుకు కొన్ని మతోన్మాద సంస్థలు యత్నిస్తున్నాయని, పోరాటాలతో పరిరక్షించుకోవాలని ఆర్‌టీఐ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ పేర్కొన్నారు. ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న ఆవాజ్ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. మతోన్మాద సంస్థలు సృష్టిస్తున్న అపోహలను, అసత్య విద్వేష ప్రచారాన్ని ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. మత సామరస్యం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ రియాజ్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సింగిల్‌గా మెజార్టీ వస్తే రాజ్యాంగం మార్చేవారని, పూర్తి మెజార్టీ ఇవ్వకుండా ప్రజలు బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. అనంతరం స్వాతంత్య్ర సమయరయోధుల ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, నాయకులు ఎస్‌కే ఇమామ్‌పాషా, యూసుఫ్ అలీ, ముక్తార్ హుస్సేన్, ఎండీ పాషా, ఎస్‌కే ఉమర్, అబ్దుల్ రెహ్మాన్, మహ్మద్, సాజీద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాసంలో ఆర్టీసీ ఆఫర్

- పుణ్యక్షేత్రాలకు యాదగిరిగుట్ట డిపోనుంచి ప్రత్యేక సర్వీసులు
- విహారయాత్రలు, శుభకార్యాలకు బస్సులు అద్దెకు
- చార్జీలో 10 శాతం రాయితీ



యాదగిరిగుట్ట : ఆర్టీసీ రోజురోజుకూ ప్రయాణికులకు మరింత చేరువవుతోంది. సీజన్‌ను అనుగుణంగా బస్సులు నడుపుతూ ప్రయాణికులను ఆకర్షించేందుకు ఆఫర్లు ప్రకటిస్తోంది. తద్వారా సంస్థను లాభాల్లోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగానే శ్రావణమాసంలో ప్రయాణికులకు ప్రత్యేక సేవలు అందించేందుకు సిద్ధమైంది.. యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో. వివాహాది శుభకార్యాలతో పాటు వివిధ పుణ్యక్షేత్రాలకు వెళ్లేవారికోసం తక్కువ చార్జీతో బస్సులను అద్దెకు ఇవ్వనున్నారు.

ప్రత్యేక రోజుల్లోనూ..

పుణ్యక్షేత్రాలకు వెళ్లేవారి సౌకర్యార్థం, శుభకార్యాలకు యాదగిరిగుట్ట డిపో సంస్థ అద్దెకు బస్సులు ఇవ్వనుంది. అంతేకాకుండా ఈనెల వరలక్ష్మి వ్రతాలు, రాఖీపౌర్ణమి పండుగ రోజున ప్రత్యేక సర్వీసులు నడపనుంది. నాగార్జునసాగర్, అరుణాచలం, తిరుపతి, శ్రీశైలం, వేములవాడతో పాటు ఇతర ఆలయాలకు, శుభకార్యాల కోసం ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించింది. యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో 99 బస్సుల ద్వారా నిత్య సేవలందిస్తోంది. ఇందులో సంస్థకు చెందిన ఎక్స్‌ప్రెస్‌లు 16, పీహెచ్‌బీ (అద్దె బస్సులు) 8, పల్లె వెలుగు 34, అద్దె బస్సులు 21, మినీ పల్లె వెలుగు 19 ఉన్నాయి.

నిర్ణీత సమయం దాటితే అదనపు చార్జి

ప్రాంతం, కిలోమీటర్లు, సమయం ప్రాతిపదికన చార్జీల వివరాలను గుట్ట డిపో అధికారులు ప్రకటించారు. అద్దె బస్సులకు చార్జీలో 10 శాతం రాయితీ ఇవ్వనున్నారు. నిర్ణీత సమయం మించితే గంటకు రూ.320 చొప్పున అదనపు చార్జి చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌గేట్‌లు ఉంటే డిపోనే భరించనుంది.

దూరం, నిర్ణీత సమయం, చార్జీలు

కి.మీ	సమయం	చార్జి (రూ.వేలల్లో)
200	08 గంటలు	15,033
240	08	16,992
270	09	18,939
300	10	20,887
330	11	22,834
360	12	24,781
390	13	26,728
420	14	28,675
450	15	30,622
480	16	32,569
510	17	34,516
540	18	36,463
570	19	38,410
600	20	40,357

సద్వినియోగం చేసుకోవాలి

శ్రావణమాసాన్ని పురస్కరించుకొని గుట్ట ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నాం.విహారయాత్రలు, శుభకార్యాలకు అద్దెకు ఇస్తాం. చార్జీలో 10 శాతం రా యితీ కల్పిస్తున్నాం. దూరం, సమయాన్ని బట్టి చార్జి తీసుకుంటాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

–శ్రీనివాస్, యాదగిరిగుట్ట డిపో మేనేజర్

● హరిత శోభితం

భూదాన్‌పోచంపల్లి-కొత్తగూడెం రోడ్డుకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లు ఆహ్లాదం పంచుతున్నాయి. హరితహారంలో భాగంగా ఒక వైపు చిల్కంచ మొక్కలు, మరోవైపు నీడనిచ్చే మొక్కలు నాటారు. అవి ఏపుగా పెరిగి, పుష్పించి ఆ మార్గంలో వెళ్లే వారికి కనువిందు చేస్తున్నాయి.

- భూదాన్‌పోచంపల్లి





అదుపుతప్పి ఆటో బోల్తా.. ఒకరు మృతి

- నలుగురికి గాయాలు

కోదాడరూరల్: ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్ వద్ద జరిగింది. శనివారం ఎస్‌ఐ ఏ. రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం కట్టకమ్ముగూడేనికి చెందిన మాదంశెట్టి కోటేశ్వరరావు(61) శుక్రవారం మఠంపల్లి మండలం పెద్దవీడుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో హుజూర్‌నగర్ నుంచి ఆటోలో కోదాడకు వస్తుండగా.. మార్గమధ్యలో కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్ వద్ద ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు తీవ్రగాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఖమ్మంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న చింతల కళావతి, నర్రా వీరమ్మ, గంగరాజు, రమ్యకు తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం ఖమ్మంకు తరలించారు. మృతుడి కుమారుడు రత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

16తులాల బంగారం, రూ.లక్ష అపహరణ

మోటకొండూర్: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి 16తులాల బంగారం, రూ.లక్ష నగదు అపహరించారు. ఈ ఘటన మోటకొండూర్ మండలం కాటేపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేపల్లి గ్రామానికి చెందిన సప్పిడి యాదిరెడ్డి శనివారం తన భార్య, కొడుకుతో కలిసి తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. సాయంత్రం 4గంటల సమయంలో యాదిరెడ్డి కోడలు తన పిల్లలను ఆడిస్తూ ఇంటి తలుపులు దగ్గర వేసి ఎదురింటికి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత తమ ఇంటి వైపు చూడగా తలుపులు తెరిచి ఉండటం గమనించి ఇంటి ఎదుట కిరాణ దుకాణం నడిపే వ్యక్తిని తీసుకుని ఇంట్లోకి వెళ్లి చూసింది. సామాను చిందరవందగా పడి ఉండటం గమనించి వెంటనే అత్తమామలకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. వారు ఇంటికి వచ్చి చూడగా.. రూ.లక్ష నగదు, 16 తులాల బంగారం కనిపించకపోవడంతో లబోదిబోమన్నారు. పోలీసులకు సమాచరం అందించగా ఎస్‌ఐ పాండు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

మోటకొండూర్: గ్రామ పంచాయతీ వీధి లైట్లు మారుస్తుండగా విద్యుదాఘాతానికి గురై యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మోటకొండూర్ మండలం ఇక్కుర్తి గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇక్కుర్తి గ్రామంలో వీధి లైట్లు వెలగకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి లైన్‌మెన్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో కరెంట్ పని తెలిసిన గ్రామానికి చెందిన అయిలి గిరిధర్‌ను వీధి లైట్లు మార్చాల్సిందిగా కోరారు. ఈ మేరకు సాయంత్రం ఎల్‌సీ తీసుకోకుండా కారోబార్‌తో కలిసి స్తంభాల పైకి ఎక్కి గిరిధర్ వీధి లైట్లు మారుస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. అతడికి తీవ్ర గాయాలు కాగా వెంటనే ఆటోలో ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పరామర్శించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య..

కాంగ్రెస్ పార్టీ నాయకుడు అయిన గిరిధర్‌ను శనివారం ఆస్పత్రికి వెళ్లి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరామర్శించారు. కుటుంబ సభ్యులను అడిగి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్లంల సంజీవరెడ్డి, బోయిని ఝాన్సీ, ఎలిమినేటి జంగారెడ్డి ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ పార్కు వద్ద పట్టణానికి చెందిన ఎండీ ఖాజా శనివారం గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు అరెస్ట్ పట్టుకున్నారు. నిందితుడు హైదరాబాద్‌లోని ధూల్‌పేట్‌లో గంజాయి కొనుగోలు చేసి స్థానికంగా అమ్ముతున్నట్లు తెలిపారు. అతడి వద్ద ఉన్న 10గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ కుమారస్వామి తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


యువకుడి మృతదేహం

నల్లగొండ క్రైం: పట్టణంలోని లతీఫ్‌సాహెబ్ గుట్టపై గుర్తుతెలియని యువకుడు శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయస్సు 28 సంవత్సరాలు ఉంటుందని, ముస్లిం వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ఎక్కడ నుంచి గుట్టపైకి వచ్చాడనే విషయంపై పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారి కొత్త అందాలను సంతరించుకుంది. వారం రోజులుగా ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఈ దృశ్యాలు పర్యాటకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. సాగర్ వద్ద లాంచీల్లో జలాశయంలో విహరిస్తూ నాగార్జునకొండకు వెళ్లడం పర్యాటకులకు మరుపురాని అనుభూతి. ఆ అనుభూతిని పొందేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి నిత్యం వేలాది మంది పర్యాటకులు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి వసతి, భోజన సౌకర్యాలు, సాగర్ చుట్టుపక్కల సందర్శనీయ స్థలాలపై ప్రత్యేక కథనం.

– నాగార్జునసాగర్

చూసొద్దాం..

అందాల సాగర్

పర్యాటకులకు స్వర్గధామం 'నందికొండ'

చెప్పలేని అనుభూతిని మిగిల్చే లాంచీ విహారం

చరిత్రకు సజీవసాక్ష్యంగా నిలిచే బుద్ధవనం, నాగార్జునకొండ మ్యూజియం



బుద్ధవనం



సాగర్ జలాశయతీరంలో 274 ఎకరాల్లో బుద్ధవనం నిర్మితమైంది. ప్రపంచంలోని బౌద్ధవాసనలు కలిగిన దేశాల్లో బుద్ధుడికి సంబంధించిన స్మృతులు బుద్ధవనంలోని మహాస్థూపం డోమ్‌పై చెక్కబడ్డాయి. సిద్ధార్థుడి జననం, బాల్యం, తదితర దశల్లో వ్యవహరించిన తీరు బుద్ధవనాన్ని సందర్శించి తెలుసుకోవచ్చు. బుద్ధవనం సందర్శనకు పెద్దలకు టికెట్ ధర రూ.100. పిల్లలకు రూ.50. ఇక్కడ ఐదు గదులు ఉన్నాయి. వీటిని అద్దెకు ఇస్తారు. ఏసీగది రూ.1500, నాన్ ఏసీ రూ.1200 ఉంటుంది. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 97058 15303ను సంప్రదించవచ్చు.

ప్రధాన జలవిద్యుత్ కేంద్రం



సాగర్ డ్యాం దిగువ ప్రాంతంలో ప్రధాన జల విద్యుత్ కేంద్రం ఉంటుంది. ఈ జల విద్యుత్ కేంద్రాన్ని సాగర్ జెన్‌కో ఎస్‌ఈ అనుమతి తీసుకొని సందర్శించాల్సి ఉంటుంది.

చేపలకూర ప్రత్యేకం

నాగార్జునసాగర్‌లో చేపలకూర, ఫ్రై ప్రత్యేకం. ఇక్కడ రోడ్ల వెంట చేపలకూరతో పాటు భోజనం వండి ఇచ్చే వారు రోడ్లవెంట డేరాలు వేసుకుని కనిపిస్తారు. ప్రస్తుతం సాగర్ 26 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుండటంతో నిత్యం వేల సంఖ్యలో పర్యాటకుల వస్తున్నారు. దీంతో ఈ డేరా హోటల్స్ జనంతో కళకళలాడుతున్నాయి.

మనస్సుదోచే ఎత్తిపోతల జలపాతం

సాగర్ నుంచి మాచర్లకు వెళ్లే రహదారిలో 14 కిలోమీటర్ల దూరంలో ఎత్తిపోతల జలపాతం ఉంది. చంద్రవంక వాగుపై సహజసిద్ధంగా ఏర్పడిన జలపాతం వద్ద 70అడుగుల పైనుంచి జాలువారే నీటి దృశ్యం పర్యాటకుల మనస్సు దోచుకుంటుంది. జలపాతం చూసేందుకు టికెట్ ధర పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20. ఇక్కడ పర్యాటకుల సౌకర్యార్థం రాత్రి బస చేసేందుకు 8 రూములు ఉన్నాయి. ఇతర వివరాలకు ఫోన్‌నంబర్ 94414 53115ను సంప్రదించవచ్చు.




మ్యూజియం

నాగార్జునకొండ మ్యూజియం

నాగార్జునకొండ ప్రపంచంలోనే రెండవ ఐలాండ్ మ్యూజియం. కొండకు వెళ్లాలంటే హిల్ కాలనీ లాంచీస్టేషన్ నుంచి 20 కిలోమీటర్ల దూరం కృష్ణానదిలో ప్రయాణం చేయాలి. కొండకు చేరుకునేందుకు లాంచీలో గంట సమయం పడుతుంది. సాగర్ పరిధిలోని హిల్‌కాలనీ లాంచీస్టేషన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లాంచీలు పర్యాటకులకు అందుబాటులో ఉంటాయి. లాంచీ టిక్కెట్టు ధర పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.150, మ్యూజియం, మాన్యుమెంట్ సందర్శనకు రూ.30. 15 సంవత్సరాలలోపు చిన్నారులకు ఉచితం. విజ్ఞాన యాత్రకు గ్రూపుగా వచ్చే విద్యార్థులకు లాంచీ టిక్కెట్‌పై 15శాతం రాయితీ ఉంటుంది.

గత ఆనవాళ్లకు చిరునామా అనుపు

హిల్‌కాలనీకి 15 కిలో మీటర్ల దూరంలో అనుపు పర్యాటక కేంద్రం ఉంది. ఇక్కడ ఆనాటి నాగార్జున విశ్వవిద్యాలయం, ఇక్ష్వాకుల కాలం నాటి యాంఫీ స్టేడియం ఆనవాళ్లు ఉన్నాయి. కృష్ణానది లోయలో లభించిన రంగనాథస్వామి దేవాలయాన్ని అదే రాతితో అనుపులోని కృష్ణానది తీరంలో నిర్మించడం విశేషం.


అనుపు



సాగర్‌మాత పుణ్యక్షేత్రం



విజయపురిసౌత్‌లోని కృష్ణానది తీరంలో సాగర్ మాత దేవాలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తుంటారు. భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా సాగర్‌మాతకు పేరు ఉంది. ఇక్కడ నెలకొల్పిన జపమాల క్షేత్రం రాష్ట్రంలోనే ప్రత్యేకతను పొందింది.



సండే స్పెషల్

ముఖ్యమైన ఫోన్ నంబర్లు

హిల్‌కాలనీ లాంచీస్టేషన్: 7997951023

ఎత్తిపోతల: 9441453115, 9494347946

విజయపురి నార్త్ ఎస్‌ఐ: 8712670197

సాగర్‌మాత దేవాలయం 9581642488


- ఫైలాన్‌కాలనీలో టైగర్ వ్యాలీ హోటల్ (ఫోన్ నంబర్ 9154393031)
- పార్కిన్ హోటల్ అండ్ రెస్టారెంట్ (ఫోన్ నంబర్ 7993750209)
- విజయపురిసౌత్‌లో మాతా సరోవర్ రిసార్ట్స్ (ఫోన్ నంబర్లు 8500718552, 7901084959)
- పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో నడిచే నాగార్జున మోటెల్ కాంప్లెక్స్ అతిథి గృహం (ఫోన్ నంబర్లు 9440968306, 9603242472)

విస్తరిస్తున్న హోటళ్లు

నాగార్జునసాగర్‌లో పర్యాటకులకు అనుగుణంగా ఇప్పుడు హోటళ్లు పెద్ద సంఖ్యలో వెలిశాయి. ప్రస్తుతం నాగార్జునసాగర్ పర్యాటకంగా అభివృద్ధి చెందుతుండడంతో పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో హోటల్ బిజినెస్ కూడా పెరిగింది. హిల్ కాలనీలోని విజయ్ విహార్‌లో నడుస్తున్న హోటల్‌లో దేశ, విదేశీయులు, ఇతర రాష్ట్రాల ప్రజలు తినే రకరకాల వంటకాలు లభ్యమవుతున్నాయి. అలాగే బుద్ధవనంలో సిద్ధార్థ హోటల్, యూత్ హాస్టల్‌లో యూత్ ప్యామిలీ రెస్టారెంట్, మనోరమ హోటల్, ఫైలాన్‌కాలనీలో ఇటీవల ఏర్పాటైన టైగర్ వ్యాలీ హోటల్ పర్యాటకులను ఆకర్షిస్తోంది. కొత్త బ్రిడ్జి అవలివైపున మాతాసరోవర్ రెస్టారెంట్, రైట్‌బ్యాంకులో మాతాసరోవర్ హోటల్ వెలిశాయి.

- పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో హిల్‌కాలనీలో విజయవిహార్ హోటల్‌లో 34 గదులు ఉన్నాయి. ముందస్తుగా ఆన్‌లైన్‌లో టీజీటీడీసీ.ఇన్ సైట్ ద్వారా బుక్‌చేసుకోవాలి. ఫోన్ నంబర్ 08680-277362.


విజయ్ విహార్ హోటల్





సాగర్ ఫైలాన్ కాలనీలో ఇటీవల భారీ బడ్జెట్‌తో ఏర్పాటైన టైగర్‌వ్యాలీ హోటల్

అటవీ అందాల అర్బన్ పార్కు

సాగర్ జలాశయతీరంలో నాగార్జునసాగర్–హైదరాబాద్, సాగర్–నల్లగొండ రహదారుల (సమ్మక్క–సారక్కల)వెంట రూ.1.5 కోట్ల వ్యయంతో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ వన్యప్రాణుల అటవీకోర్ ఏరియాలో ఏర్పాటు చేసిన అర్బన్ పార్కు అటవీ అందాలను ఆరబోస్తుంది. 980 హెక్టార్ల విస్తీర్ణంలోని ఈ పార్కు ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంతంలో గుట్టల మధ్య సాగర్ బ్యాక్ వాటర్ అందాలను తిలకించేందుకు నెల్లికల్లు అటవీ ప్రాంతంలో వ్యూ పాయింట్ నిర్మించారు. అడవి అందాలను వీక్షించే పర్యాటకుల కోసం రెండు రకాల సఫారీ వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఆ వాహనంలో 10 కిలోమీటర్ల పరిధిలో పర్యటించేందుకు రూ.1,000, 24 కిలోమీటర్ల పరిధిలో పర్యటించేందుకు రూ.1500 వసూలు వేస్తున్నారు.



15 గేట్ల ద్వారా పులిచింతల నీటి విడుదల

హుజూర్‌నగర్: ఎగువన గల నాగార్జునసాగర్ నుంచి 3,29,932 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి పులిచింతల ప్రాజెక్ట్‌లో చేరుతోంది. దీంతో పులిచింతల ప్రాజెక్ట్‌లోని 10 గేట్లను 2.5మీటర్లు, 5 గేట్లను 3మీటర్లు పైకి ఎత్తి 3,09,932 క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజ్‌కు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 31.91 టీఎంసీల నీరు ఉంది. పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని నాలుగు యూనిట్ల ద్వారా 74 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

యాదాద్రిలో సీఎం రేవంత్ సోదరుడి పూజలు


యాదాద్రి ఆలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి, కుటుంబ సభ్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకామూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తుల చెంత అష్టోత్తర పూజలు నిర్వహించారు. వారికి అర్చకులు ఆశీర్వచనం చేయగా.. ఆలయాధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. వారి వెంట ఈఓ భాస్కర్‌రావు ఉన్నారు.

నిస్వార్థ సేవకు చిరునామా 'కోణం ఫౌండేషన్'



మాట్లాడుతున్న జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి



రైతులకు అవార్డులు ఇస్తున్న రఘురామిరెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి తదితరులు

- ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి

నల్లగొండ: నిస్వార్థ సేవకు చిరునామా కోణం ఫౌండేషన్ అని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పి. రఘురామిరెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని ఐటీ హబ్‌లో నిర్వహించిన కోణం ఫౌండేషన్ 8వ వార్షికోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. విదేశాల్లో గాక స్వదేశంలో కూడా ఐటీ కంపెనీ నెలకొల్పి అర్హులైన నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న కోణం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సాందీప్ కోణం ఆలోచనలు అందరికీ స్ఫూర్తినిస్తాయన్నారు. డీఈఓ భిక్షపతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంచేందుకు కోణం ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కోణం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సాందీప్ కోణం మాట్లాడుతూ.. శాస్త్రసాంకేతిక రంగాల్లో మానవాళి శ్రేయస్సును కాంక్షిస్తూ వినూత్న ఆవిష్కరణలు చేయడం, కృత్రిమ మేధస్సుతో సామాజిక సవాళ్లకు పరిష్కారాన్ని చూపడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. అనంతరం తమ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన రైతులు మరెడ్డి జానకిరాంరెడ్డి, నిమ్మనగోటి రమేష్, మందడి నర్సిరెడ్డికి కోణం కృషి పయనీర్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ హుస్సేన్‌బాబు, ఎంపీ గోనారెడ్డి, కొలనుపాక రవికుమార్, బి. మహేష్, శ్వేత పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి


చంద్రయ్య (ఫైల్)

కొండమల్లేపల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామానికి చెందిన గోరెటి చంద్రయ్య అలియాస్ గంటెల చంద్రయ్య(55) కొండమల్లేపల్లిలో ప్లాస్టిక్ సీసాలు, తాగేసిన బీరు సీసాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో సాగర్ రోడ్డులోని సెంట్రల్ బ్యాంక్ ఎదుట గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చంద్రయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చంద్రయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఈదమ్మ, కుమారుడు ఉన్నారు. మృతుడి కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ సీత్యానాయక్, హెడ్ కానిస్టేబుల్ జగన్ తెలిపారు.